


# కరపత్రం

SINCE 2014

బుధవారం ఫిబ్రవరి 18, 2026 | సంపుటి : 2 | సంచిక : 132 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

» నాణ్యమైన విద్యాసంస్థలకు నెలువుగా నగరం
» జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు
» రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం
» బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,ఫిబ్రవరి17 :**
హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు. హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు. సైన్స్, ఎఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

02

## తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

▪ మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్
▪ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,ఫిబ్రవరి17 :**
తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ 2025 -26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకారులకు ఇష్టమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ ఆప్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా రంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణిక్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సీఎం కప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు.క్రీడాకారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేసే విధంగా సీఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంటర్ ద్వారా 24 గంటల సమాచారాన్ని క్రీడాకారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. 44 క్రీడాంశాలు 12 జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీలు విజయవంతం కావాలని ఈ క్రీడలనుంచి మంచి ఛాంపియన్లు వృద్ధిలోకి రావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు పలువురు పాల్గొన్నారు.

## ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్'గా హైదరాబాద్

▪ లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 5 లక్షల మందికి ఉద్యోగాలు
▪ ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా తెలంగాణ
▪ 'బయో ఏషియా 2026' ప్రారంభోత్సవంలో
మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



02

**హైదరాబాద్,ఫిబ్రవరి17 :**
ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్ ను 'ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్' గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో రాష్ట్రాన్ని ఒకటిగా నిలిపేందుకే 'తెలంగాణ నెక్ట్స్ - జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026-2030)' రూపొందించామని మంగళవారం హెచ్ఐసీసీ లో నిర్వహించిన 'బయో ఏషియా 2026' సదస్సు ఆయన వివరించారు. ఇప్పటి వరకు లైఫ్ సైన్సెస్ రంగంలో సప్లై కోసం మాత్రమే మన వైపు చూసిన ప్రపంచం ఇప్పుడు ప్రస్తుతం ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం చూస్తోందన్నారు.



## ఐబొమ్మ రవికి బెయిల్.. దేశం విడిచివెళ్లొద్దని హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్:**
సినిమా పైరసీ కేసులో 'ఐబొమ్మ' రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇమంది రవి ఎట్టి పరిస్థితుల్లోనూ దేశం విడిచి వెళ్లొద్దని, తన పాస్‌పోర్టును కోర్టులో సరెండర్ చేయాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ కేసులో గతేడాది నవంబరులో అతడు అరెస్టయిన విషయం తెలిసిందే.

## బిల్‌గేట్స్ పర్యటనపై విషం కక్కుతున్న జగన్: మంత్రి పార్థసారథి



02

**అమరావతి:**
రాష్ట్ర అభివృద్ధికి జగన్ వ్యతిరేకి అనే విషయం మరోసారి నిరూపితమైందని ఏపీ మంత్రి పార్థసారథి విమర్శించారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ అమరావతి

## రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు

» క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలి
» ఫీల్డ్‌కు వెళ్లని అధికారులను తొలగిస్తాం
» నెక్లెస్ రోడ్డులో మల్టీలెవల్ కారు పార్కింగ్
» కొత్త మేయర్లు, మున్సిపల్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ
» మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ వెల్లడి

2 లో

**హైదరాబాద్,ఫిబ్రవరి17 :**
రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.





02

## ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**దిల్లీ:**
ఓఎంసీ కేసులో నిందితురాలైన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి చుక్కెదురైంది. డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. క్యాప్టివ్ మైనింగ్ పదాన్ని తొలగించి అక్రమాలకు దారులు తెరిచారని.. దీనిలో శ్రీలక్ష్మి కీలకంగా వ్యవహరించారని సీబీఐ వాదించింది.



మిగతాది 2లో

## లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

» 7 సీట్లు మాత్రమే గెలిచినా వరించిన విజయం
» చైర్మన్‌గా శ్రవణ్ కుమార్ ఎన్నిక
» తొర్రూరు చేజారడంతో ఎర్రబల్లి కన్నీరు

**మహబూబాబాద్,ఫిబ్రవరి17 :**
ఉత్కంఠకు తెరదించుతూ తొర్రూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం జరిగిన హోరాహోరీ పోరులో చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇరు వర్గాల బలాబలాలు సమానంగా ఉండటంతో అధికారులు 'లక్కీ డ్రా' పద్ధతిని అనుసరించారు. ఈ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థి, రెండో వార్డు సభ్యుడు శ్రవణ్ కుమార్ విజేతగా నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన పేరును అధికారికంగా ప్రకటించి పత్రాన్ని అందజేశారు.



## జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

» పరీక్ష కు హాజరైన 318 మంది విద్యార్థులు
» 100పర్సెంటైల్ పైగా సాధించిన 5గురు విద్యార్థులు
» 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించిన 28మంది విద్యార్థులు
» అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

2లో..

**హైదరాబాద్,ఫిబ్రవరి17 :**
దేశవ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు 318 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19) , సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర



## తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

» 72 కిలోల కేక్ కట్ చేసిన పార్టీ నేతలు
» తెలంగాణ ఉద్యమ నేపథ్య పాటలు, డాక్యుమెంటరీ విడుదల
» కెసిఆర్ మళ్లీ సిఎం అవుతారన్న మాజీమంత్రి తలసాని
» ముమ్మాటికీ కెసిఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కెటిఆర్

2 లో

**హైదరాబాద్,ఫిబ్రవరి17 :**
బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు

# తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

మొదటిపేజీ తరువాయి
.కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటెర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి÷టైర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి'గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్య్రం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపితగా ప్రజలు పిలుచుకుంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్తున్నాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళ తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు తెలుసనన్నారు.

## జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

మొదటిపేజీ తరువాయి
( 87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు. గతంలో రెండు సీఓఈ లలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈ లను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి , బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్ , ఐఎఎస్, ఎంజెపి సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ అభినందించారు.

## ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

మొదటిపేజీ తరువాయి
పదవిలో ఉన్నంతకాలం ఆమె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు.. డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. వేరే కేసుగా భావించి తొలుత స్టే ఇచ్చామని.. ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ ధర్మాసనం పేర్కొంది. పొరపాటుగా ఇచ్చిన స్టేను నిందితులు ఎంజాయ్ చేశారని వ్యాఖ్యానించింది. ట్రయల్ కోర్టులో విచారణ కొనసాగించాలని ఆదేశించింది.

## 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం

**- కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు**
**- కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ భేటీ తర్వాత తెలంగాణ క్యాబినెట్‌లో మార్పులు లేదా చేర్పులు ఉండొచ్చనే ఊహాగానాలు కూడా రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి.

ఖాళీల భర్తీతో పాటు పలువురి మంత్రి పదవుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకునే వీలుందని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా గ్యారెంటీల అమలు తీరుపై అధిష్టానం సమీక్షించనుంది. అలాగే ఇటీవల వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలపైనా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంతృప్తితో ఉంది. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ నిర్మాణం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం , పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దిశానిర్దేశర చేయనుంది. అలాగే విపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం , భవిష్యత్తు ఎన్నికల వ్యూహాల గురించి రాహుల్ గాంధీ స్వయంగా నాయకులకు సూచనలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 19వ తేదీ ఉదయం తెలంగాణ నేతలతో సమావేశమై, అదే రోజు సాయంత్రం మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో భేటీ కానుంది. రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వం , పార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

## మండలిలో డిజిటల్ అటెండెన్స్ ఎందుకు పెట్టలేదు ?

**- కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇంకా అబద్దాల ప్రచారమేనా**
**- మీడియా పాయింట్ వద్ద విపక్షనేత బొత్స ఆగ్రహం**

శాసనసభలో డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేసిన ప్రభుత్వం, అదే విధానాన్ని శాసనమండలిలో ఎందుకు అమలు చేయడంలేదని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, దేవదేవుడి ప్రసాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనవసర ఆరోపణలు చేశారని బొత్స ఆరోపించారు. పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిపారని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వాస్తవాలు తేలాలని సుప్రీంకోర్టు సిట్ నియమించిందని, దర్యాప్తులో కొన్ని ఆశ్చర్యకర విషయాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. ప్రజలు జీర్ణించుకోలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని వ్యాఖ్యానించారు.కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారనే కారణంతో ఇందాపూర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారని, ఇప్పుడు అదే సంస్థ రూ.680కు నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ సంస్థకు హెరిటేజ్ ఫుడ్స్ సంబంధం ఉందని, ఇవన్నీ తాము సృష్టించిన ఆరోపణలు కాదని ? సంబంధిత సంస్థలే వెల్లడించాయని అన్నారు. ఇందాపూర్‌ను అడ్డుపెట్టుకుని హెరిటేజ్ దోపిడీకి ఎ÷-లాన్ చేసిందని, దేవుడి పేరుతో రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సభలో ఇందాపూర్ అంశంపై చర్చకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. టాయిలెట్లలో వాడే కెమికల్స్ లడ్డూలో కలిపారని సీఎం మాట్లాడటం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఏ స్థాయికైనా వెళ్తారని విమర్శించారు.

## నేడుహైదరాబాద్‌కు 3వ దమ్మ యాత్ర స్వాగతం పలకనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

లోక కల్యాణం, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ థాయిలాండ్, భారతదేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు చేపట్టిన చారిత్రాత్మక '3వ దమ్మ పాదయాత్ర' బుధవారం (ఫిబ్రవరి 18న) మధ్యాహ్నం 1:00 గంటలకు నగరంలోని ఐమ్యాక్స్ పక్కన గల డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోనుంది. ఈ పవిత్ర దమ్మ యాత్రకు పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు స్వాగతం పలకనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రముఖులు పాల్గొంటారు.

÷బితమ బుద్ధుడు బోధించిన శాంతి, కరుణ సందేశాలను చాటిచెప్పే లక్ష్యంతో సాగుతున్న ఈ పాదయాత్ర కర్ణాటకలోని సిద్దార్థ బుద్ధ విహార్ నుంచి ప్రారంభమైంది. సుమారు 400 కిలోమీటర్లకు పైగా కాలినడకన సాగే ఈ యాత్ర మార్చి 1న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం చేరుకోనుంది. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం, భిక్షువులు హుస్సేన్ సాగర్ లోని చారిత్రాత్మక బుద్ధ విగ్రహాన్ని దర్శించుకుంటారు.÷ాయ్‌లాండ్‌కు చెందిన ప్రా సోంగ్‌శాక్ కోవిడో నేతృత్వంలో, గగన్ మాలిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 18 సాయంత్రం పాదయాత్ర మహబోధి బుద్ధ విహార్‌కు చేరుకోనుంది, భిక్షువులు ఫిబ్రవరి 19 వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఉప్పల్, ఇబ్రహీంపట్నం, కొండమల్లేపల్లి మీదుగా ప్రయాణించి మార్చి 1న బుద్ధవనం వద్దకు యాత్ర చేరుకోనుంది. ఈ పాదయాత్ర ప్రపంచ శాంతిని ప్రోత్సహించే ఒక గొప్ప ఆధ్యాత్మిక-సాంస్కృతిక ఘట్టమని బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు.

## సంత్ సేవాలాల్ విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం

**- పర్యాకట ప్రాంతంగా అభివృద్ధి చెందేలా ఏర్పాటు**
**- నల్లమల మద్దిమడుగు ప్రాంతంలో స్థల అన్వేషణ**
**- ఎంపి, ఎమ్మెల్యలేతో కలసి అధికారుల పరిశీలన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి కే .యస్ శ్రీనివాస్ రాజ్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, ఇతర గిరిజన నాయకులు మరియు అధికారులు కలిసి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం మద్దిమడుగు గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ స్థాపనకు ప్రతిపాదించిన 20 ఎకరాల స్థలాన్ని వారితో కలిసి పరిశీలించారు. సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రాజ్ మాట్లాడుతూ..., గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని దేశంలోనే అతిపెద్దదిగా నిర్మించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు పేర్కొన్నారు. లంబాడీల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విగ్రహ నిర్మాణానికి సంబంధించి పది నెలల్లో పక్కా ప్రణాళికలు రూపొందించి, త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత స్థలం నల్లమల్ల అటవీ ప్రాంత పరిధిలో ఉండటంతో భౌగోళిక పరిస్థితులు, భద్రతా అంశాలు, రవాణా సౌకర్యాలు మరియు ప్రజలకు సులభ వసతులు ఉండేలా వంటి అంశాలను అధికారులు సమగ్రంగా చర్చించి ప్రణాళికలు రూపొందించి ముఖ్యమంత్రికి సమర్పించనున్నట్లు తెలిపారు. స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా గుర్తింపు పొందిన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ నిర్మాణం ద్వారా సమాజానికి, దేశానికి గౌరవ సూచకంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. స్థానిక గిరిజన నాయకులతో చర్చించి అందుకు అనుగుణంగా విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం దేశానికి ఒక దిక్సూచిగా నిలుస్తుందని నల్లమల్ల ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి సంకల్పించడం ఎమ్మెల్యేగా నా అదృష్టంగా భావిస్తున్నానని, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. దేశంలోనే నల్లమల్ల ప్రాంతం సుస్థిరంగా నిలిచిపోయేలా ముఖ్యమంత్రి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కృష్ణా నదిపై వంతెనను నిర్మిస్తే ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు రవాణ సౌకర్యంతో పాటు మద్దిమడుగు పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ....ంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పం ముఖ్య మంత్రికి బలంగా ఉండడం గిరిజనుల అదృష్టంగా భావిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. సమ్మక్క సారక్క జాతరలో ఏ విధమైన అభివృద్ధి చెందిందో మద్దిమడుగు అదే తరహాలో అభివృద్ధి చెందాలని సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారని, మైదాన ప్రాంతంలో నివసించే గిరిజనులను అభివృద్ధి పరచాలని ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఉందని అదే స్థాయిలో ముఖ్యమంత్రి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్లో సంత్ సేవాలాల్ విగ్రహాలకు ఆదర్శంగా తీసుకొని నల్లమల్లలో అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే విగ్రహాన్ని దేశస్థాయి ప్రతిష్టను ప్రతిబింబించేలా ఉంటుందని ఎంపీ ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ÷రిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గిరిజన ల అదృష్టంగా భావిస్తున్నామని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు అదేవిధంగా గిరిజన ప్రాంతాలను అభివృద్ధి పరుస్తూ వారి ఆర్థిక స్థితిగతులను పెంచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆలోచనలు ముందుకు తీసుకుపోయే విధంగా జిల్లా యంత్రాంగం అన్ని వసతులతో పాటు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.విగ్రహ ఏర్పాట్లకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ విగ్రహ ఏర్పాట్లు రానున్న సంవత్సర కాలంలో పూర్తిచేసేలా నిరంతరం జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ ఎన్ సి మోహన్ నాయక్ , ఆలిండియా బంజారాల నాయకుడు రామ్ నాయక్, ఇతర గిరిజన నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి
తెలంగాణతో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యమన్నారు. ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అలాంటి వాతవరణాన్ని కల్పిస్తుంది. దీనికి సమాధానం హైదరాబాదేనని అన్నారు. బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. మేము కేవలం భారతదేశంలోనే పోటీ పడటం లేదు, ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందన్నారు. ఇప్పుడు మనం కలిసి దీన్ని సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని చెప్పారు.ఇక్కడ పెట్టుబడులు పెట్టండి,మీ ఉఅఅలను స్థాపించండి, ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండని కోరారు. మాలిక్యూల్స్ , ఔషధాలను డిజైన్ చేయండి , క్లినికల్ అనలిటిక్స్‌ను నడపండి, ఎఐ ఎ÷-లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయండి, డిజిటల్ తయారీని ముందుకు తీసుకెళ్లండని వెల్లడించారు. మా ప్రభుత్వం, అధికారులు, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయానికి భాగస్వాములుగా ఉంటారని సీఎం రేవంత్ తెలిపారు. మనమంతా కలిసి పనిచేస్తే హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుండి ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుందని తెలిపారు. ప్రపంచానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం.. తెలంగాణ ఎదుగుతోంది.. ఈ ఎదుగుదలలో మీరు భాగస్వాములుకండి.. అని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

## రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు

మొదటిపేజీ తరువాయి
కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.పురపాలక శాఖపై మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వటైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వటైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ ఉండాలన్నారు. జంక్షన్‌ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జీహెచ్ఎంసీ విభజన విషయంలో తలెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి
మున్సిపాలిటీని దక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, బీఆర్ఎస్ క్యాంప్‌లో విషాదం నెలకొంది. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డుల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలుచుకోగా.. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ కడియం కావ్యల ఎక్స్అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ సంఖ్య 9కి పెరిగింది. రెండు పార్టీల బలాలు సమానం కావడంతో అధికారులు లాటరీ ద్వారా ఛైర్మన్‌ను నిర్ణయించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్అఫీషియో ఓటు చెల్లదంటూ బీఆర్ఎస్ శ్రేణులతో ఆందోళనకు దిగిన దయాకర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను నర్సింహులుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు.అయితే, తన రాజకీయ కంచుకోటగా భావించే తొర్రూరు మున్సిపాలిటీ చేజారిపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తల కష్టాన్ని తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రాణాలకు తెగించి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేను ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలని అంటూ ఆయన కంటతడి పెట్టారు. నాయకులు కేసీఆర్ అంటే ప్రజల్లో ఎంత అభిమానం ఉన్నా, అధికార పార్టీ సాగిస్తున్న అరాచకాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని ఎర్రబెల్లి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి పనిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి ముగింపు పడుతుందని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా 'జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

## ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్'గా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి
గ్లోబల్ హబ్‌ల సరసన నిలిచిన ఏకైక భారతీయ నగరం హైదరాబాద్ అని అన్నారు. అందుకే... కేవలం ఉత్పత్తి చేయడమే కాకుండా, నేటి అవసరాలకు అనుగుణంగా కొత్త ఔషధాలను కనుగొనే కేంద్రంగానూ హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అలాగే... గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్ గానూ మార్చేందుకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, ఆటోమేషన్ ఇన్ బయోలాజిక్స్ మాన్యుఫాక్చరింగ్, డేటా ఆధారిత ప్రెసిషన్ మెడిసిన్ , కంప్యూషనల్ బయాలజీ, బయో మాన్యుఫాక్చరింగ్ 4.నీ తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

## బిల్‌గేట్స్ పర్యటనపై విషం కక్కుతున్న జగన్: మంత్రి పార్థసారథి

మొదటిపేజీ తరువాయి
పర్యటనపై ఆయన విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంత్రి మాట్లాడారు."వైకాపా ఐదేళ్ల పాలన విధ్వంసానికి.. కూటమి పాలన నిర్మాణానికి నిదర్శనం. కూల్చివేతల ఆలోచన ఉన్న జగన్.. అమరావతి నిర్మాణం జరుగుతుంటే ఓర్చుకోలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు విజన్‌ను బిల్‌గేట్స్ పొగడటంతో జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రం బాగుపడటం ఆయనకు ఇష్టం లేదు. అందుకే బిల్‌గేట్స్ పర్యటనపై బురద చల్లిస్తున్నారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా అభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు" అని పార్థసారథి అన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి తన కుమార్తె హిత రెడ్డి జన్మదినం సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం గోపి, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, నాయకులు నెమురి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ లో కేసీఆర్ జన్మదిన వేడుకలు



**గాజంగి మహేశ్వర్ కరపత్రం మెట్టుపల్లి**
మల్లాపూర్ మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక భారత మత కూడలి వద్ద మండల అధ్యక్షుడు తోట శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర అపూర్వమని, ఆయన నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ది ఏ జాతి అంటావా..

» ఇదే మా జాతి: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు
» కేసీఆర్‌ది ఏ జాతి, జాతిపిత ఎలా అవుతారని ఇటీవల రేవంత్ రెడ్డి వ్యాఖ్య
» మాది రాణీ రుద్రమ, సమ్మక్క-సారక్కల జాతి అన్న కేటీఆర్
» సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని ప్రశ్న



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్**
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారని, ఆయన ఏ జాతికి జాతిపిత అని ఎద్దేవా చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రాణీ రుద్రమ, సమ్మక్క సారక్క, దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ మహాపురుషుల జాతి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు నిర్వహించారు.
ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్‌ను తూలనాడుతూ కొంతమంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జాతి గురించి అడుగుతున్నారని, కానీ తెలంగాణ మట్టితో మమేకమైన వారికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వారికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వారికి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. కానీ సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని అన్నారు.
ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ది ఏ జాతి, ఎవరికి జాతిపిత అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో తెలంగాణ వాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతులు ఉన్నాయని అన్నారు.
"సమైక్యాంధ్రవాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలియదు. నీతి తెలియదు. లాఠీ దెబ్బలు తిన్నవారికి, జైళ్లకు వెళ్లిన వారికి, తుపాకీలకు ఎదురొడ్డి నిలబడ్డ వారికి జాతి అంటే, జాతి అస్థిత్వం అంటే ఏమిటో తెలుసు. ఉద్యమకారుల పైకి తుపాకులు తీసుకెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుస్తుంది. రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే ఆత్మాభిమానం అనేది ఎక్కడైనా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏమిటో, జాతి చరిత్ర అంటే ఏమిటో తెలుస్తుంది. కానీ జై తెలంగాణ నినాదం ఇవ్వడానికే భయపడేవారికి, తెలంగాణ సోయిలేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలియదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు.
"కొందరు అడుగుతున్నారు నీది ఏ జాతి అని. ఏ జాతికి జాతి పిత అని అడుగుతున్నారు. వారికి నేను సమాధానం చెబుతున్నాను. ఏ జాతి అనే అల్పుడికి నేను చెబుతున్నాను. రాజ్యతంత్రం నడిపిన రుద్రమ జాతి మాది. జల్ జంగల్ జమీన్ అని కొట్లాడిన కొమురంభీం, అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క, సారక్క, కోటల మీద జెండా ఎగురవేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న, భూస్వాముల దోపిడి మీద కొట్లాడిన దొడ్డి కొమురయ్య, బరిలో బందూకు పట్టి దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ, సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ, సిపాయిల తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తుర్రేబాజ్ ఖాన్, ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే ఉప్పుపాతర వేస్తామన్న కాళోజీ, నా తెలంగాణ కోటి రతనాల అన్న దాశరథి, విద్యార్థి అమరవీరుల జాతి మాది" అని కేటీఆర్ ఉద్ఘాటించారు.

# కరీంనగర్ మేయర్ పీఠంను దక్కించుకున్న బీజేపీ

– కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి ఎనలేనిది
– బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు కే గీత మూర్తి





**కరపత్రం ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 17:**
కరీంనగర్ మేయర్ పీఠంను బీజేపీ దక్కించుకోవడం పట్ల బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు కే గీత మూర్తి హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్ పట్టణ మేయర్ గా కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ గా సునీల్ రావు లను ఎన్నుకోవడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్, నేరేడ్ మెట్ లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ ఎస్, ఎంఐఎమ్ లు కలిసి ఎంత నాటకం చేసినా చివరికి మేయర్ పీఠం ను బీజేపీ గెల్చుకుందని గీతా మూర్తి పేర్కొన్నారు. ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి బీజేపీ పీఠాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేసిందని, కానీ ధర్మం మా వైపే ఉంది కాబట్టి బీజేపీ గెలిచిందని ఆమె అన్నారు. 2005 లో బండి సంజయ్ కుమార్ మొదటి సారి కరీంనగర్ లో కార్పొరేటర్ అయిన తర్వాత ప్రస్తుతం మేయర్ పీఠం బీజేపీ కైవసం చేసుకోవడం గొప్ప అనుభవం అని ఆమె చెప్పారు. గత నెల రోజుల నుండి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తాను కరీంనగర్ లోనే ఉండి పార్టీ విజయానికి దోహదం చేశారని ఆమె ఆనందం వ్యక్త పరిచారు. ఇక పై పట్టణ అభివృద్ధికి మేయర్, డిప్యూటీ మేయర్ లు పని చేస్తారని అన్నారు. ఎన్నికల క్యాంపెయిన్ లో హైదరాబాద్ నుండి, జిల్లాల నుండి బీజేపీ నేతలు, కార్యకర్తలు వచ్చి మున్సిపల్ ఎన్నికల్లో పని చేశారని తెలిపారు. కరీంనగర్ పట్టణ ఓటర్లకు, ప్రజలకు ఈ సందర్భంగా గీతా మూర్తి ధన్య వాదాలు తెలిపారు. గీతామూర్తి తో పాటు బీజేపీ నేతలు కరుణ శ్రీ, అంజలి దేవి, పద్మజా రెడ్డి, మన్నె శ్రీనివాస్, రాజి రెడ్డి, మల్లికార్జున, గోల్కొండ జిల్లా నుండి దశ రథ లక్ష్మీ, అరుణ, లక్ష్మీ తదితరులు దాదాపు 20 రోజులు కరీంనగర్ లో ఉండి ప్రచారం చేశారని ఆమె అన్నారు. అలాగే స్థానిక నేతలు సురేందర్ రెడ్డి, అరుణా రెడ్డి, డాక్టర్ సునీల్ మంగళం, సులోచన, సుమ, సురేశ్, శ్రీనివాస్ తదితరులు ప్రచారం లో సహాయం అందించారని గీతా మూర్తి పేర్కొన్నారు. కరీంనగర్ లో బీజేపీ విజయంతో జూన్ లో జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ కాషాయ జెండా ఎగుర వేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# గుండ్ల పోచంపల్లిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
గుండ్ల పోచంపల్లి డివిజన్ కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మల్లన్న దేవాలయంలో కేసీఆర్ ఆయురారోగ్యాలతో వందేళ్లు బతకాలని పూజలు చేశారు. తెలంగాణను సాధించి, దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని నేతలు కొనియాడారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కూడా జరిగింది.

# సిద్ధార్థరెడ్డిని లొంగిపోవాలని సుప్రీంకోర్టు సుప్రీంకోర్టు కావాలి జారీ..

- సుప్రీంకోర్టు తీర్పును స్పందించిన సినీ నటి ప్రత్యూష తల్లి
- తీర్పును స్వాగతిస్తున్నామని, కానీ పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని వ్యాఖ్య
- కూతురు మృతి చెందిన సమయంలో బెదిరింపులు వచ్చాయన్న ప్రత్యూష తల్లి



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ**
ఉన్నతస్థానానికి చేరుకోవాల్సిన తన కూతురు జీవితాన్ని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
తన కూతురు మృతి కేసులో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, కానీ తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని సినీ నటి ప్రత్యూష తల్లి సరోజినీదేవి అన్నారు. ప్రత్యూష మృతి కేసులో సిద్ధార్థరెడ్డిని లొంగిపోవాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు తీర్పుపై ఆమె స్పందిస్తూ, అతనికి సరైన శిక్ష పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
తన కూతురు మృతి చెందిన సమయంలో తమకు బెదిరింపులు వచ్చాయని, కానీ ధైర్యంగా న్యాయస్థానంలో పోరాడామని అన్నారు. తన కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఆమెను చంపేశారని ఆరోపించారు. న్యాయం కోసం మొదటి నుంచి పోరాటం చేస్తున్నానని అన్నారు. ఉన్నతస్థానానికి చేరుకోవాల్సిన తన కూతురు జీవితాన్ని నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడు సిద్ధార్థరెడ్డి విదేశాల్లో ఉన్నాడని తెలిసిందని అన్నారు.
ఈ కేసును మొదట్లోనే అంతా తారుమారు చేశారని ఆరోపించారు. పోస్టుమార్టం నివేదికను కూడా ఆమె తప్పుబట్టారు. కానీ కొన్ని సాక్ష్యాలను సేకరించి పోరాటం ప్రారంభించానని అన్నారు. అప్పుడే సాక్ష్యాలు అన్నీ ఉండి ఉంటే నిందితులకు జీవితకాల శిక్ష తప్పకుండా పడేదని అన్నారు. కన్నతల్లిగా తాను ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను పక్కన పెట్టారని ఆరోపించారు. 24 ఏళ్లుగా ఒంటరిగా పోరాడుతూ నరకం అనుభవిస్తున్నానని, తమకూ ఎవరూ తోడుగా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## పోటీవద్దదక్కడ .. పొత్తు గల్సిందిక్కడ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పీఠాలను కైవసం చేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విచిత్రమైన పొత్తులు పెట్టుకున్నాయి. రాజకీయ అవసరాలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎవరితోనైనా సర్దుకుపోవడానికి, పొత్తులతో హత్తుకోవడానికి పార్టీ అధి నాయకత్వాలు స్థానిక నేతలకు పూర్తి స్వేచ్ఛనిచ్చాయి. ఈ క్రమంలో ,, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కచోట ,,.. ,, కాంగ్రెస్, బీజేపీ మరో చోట ,, జతకట్టి హంగ్ మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పీఠాలను దక్కించుకున్నాయి.

## మహిళను హత్య చేసిన పూజారి
## - యావజ్జీవ శిక్ష విధించిన కోర్ట్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బంగారు నగలు దోచుకునేందుకు పూజారి మురళీకృష్ణ ఒక మహిళను హత్య చేసిన కేసులో అతనికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.7 వేల జరిమానా విధిస్తూ మల్కాజిగిరి 4వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డి.కిరణ్‌కుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. 2022 ఏప్రిల్ 18న మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలోని స్వయంభూ సిద్ధివినాయక గుడిలో పూజారిగా పనిచేస్తున్న మురళీకృష్ణ, రోజూ గుడికి వచ్చే ఉమాదేవి(57) ఒంటిపై ఉన్న బంగారు నగలను దోచుకునేందుకు పథకం పన్నాడు. ఆమెను గర్భగుడిలో ఐరన్ రాడ్డుతో తలపై మోది హత్య చేశాడు. మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి, మూడు రోజుల పాటు గుడికి తాళాలు వేసి శుభ్రం చేశాడు. దుర్వాసన రావడంతో మృతదేహాన్ని గుడి వెనుక చెట్ల పొదల్లో పారేశాడు. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం పోలీసులు మురళీకృష్ణను అరెస్ట్ చేసి, నగల కోసమే హత్య చేసినట్లు నేరం అంగీకరించడంతో అతనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో నేరాభియోగ పత్రాన్ని సమర్పించి, విచారణ అనంతరం ఈ తీర్పు వెలువడింది.

# ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో షాక్

– తప్పు చేసేవారు తప్పించుకోలేరు!



ఎ ప్రభుత్వ పెద్దలైనా ఐఏఎస్ ఐపీఎస్ లైన తప్పులు చేస్తే శిక్షల నుండి తప్పించుకోలేరని న్యాయానికి ఒకే చట్టం ఉందని అది ఎవరిని వదలదని ప్రభుత్వాలు గమనించి అధికారులు ప్రజాప్రతినిధులకు దాసోహం అంటున్నారు వారికి ఉన్న విశేష అధికారులను పక్కనపెట్టి ప్రజా ప్రతినిధులకు జీ హుజూర్ అంటూ పనిచేస్తున్నారు. అధికారులు గుర్తుంచుకోవలసిన విషయం ప్రజా ప్రతినిధులు వస్తుంటారు పోతుంటారు. కానీ ఒక్కసారి ఉన్నత స్థాయి అధికారి 40 సంవత్సరాలు పదవి ఉంటుందని మర్చిపోతున్నారు. ఏది ప్రభుత్వం అధికారం వస్తే ఆ ప్రభుత్వానికి అధికారులు దాసోహంగా పనిచేస్తున్నారు. చట్టాలను తయారు చేసేది తామే అన్న విషయాలను మరిచిపోయి ప్రజా ప్రతినిధులకు గులాం గిరి చేస్తున్నారు.
వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు , గాలి జనార్ధన్ రెడ్డికి సంబంధించిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసుల నుంచి తన పేరును తొలగించాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఆమె డిశ్చార్జ్ పిటిషన్లను తిరస్కరించగా, ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.
విచారణ సందర్భంగా ఆమె తరపు న్యాయవాదులు వాదిస్తూ.. కేవలం ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే తాను విధులు నిర్వహించానని, ఇందులో ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనం లేదని పేర్కొన్నారు. అయితే, సీబీఐ తరపు న్యాయవాదులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. మైనింగ్ లీజుల కేటాయింపులో , క్విడ్ ప్రో కో వ్యవహారాల్లో శ్రీలక్ష్మి కీలక పాత్ర పోషించారని, నిబంధనలను ఉల్లంఘించారని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. కేసు ఈ దశలో ఉన్నప్పుడు ఆమె పేరును తొలగించలేమని స్పష్టం చేసింది. సీబీఐ మోపిన అభియోగాల్లో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించిన కోర్టు, ట్రయల్ కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సిందేనని ఆదేశించింది.
ఈ తీర్పుతో శ్రీలక్ష్మి ఇప్పుడు సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఓబులాపురం గనుల కేసులో నిందితులందరికీ జైలు శిక్ష ఖరారు అయింది. ఒక్క శ్రీలక్ష్మి గతంలో హైకోర్టు నుంచి డిశ్చార్జ్ ఉత్తర్వులు తెచ్చుకున్నందున ఆమెపై విచారణ జరపలేదు. ఇప్పుడు ఆ ఉత్తర్వులను కొట్టివేసినందున.. ఆమెకు కూడా శిక్ష ఖరారు కావడం ఖాయమని భావిస్తున్నారు. ఈ కేసుల కారణంగా గతంలో ఆమె చాలా కాలం జైల్లో ఉన్నారు. అయినా ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ తెలంగాణ నుంచి.. ఏపీకి వచ్చారు. జగన్ ప్రభుత్వం మరిన్ని అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెకు పోస్టింగ్ దక్కలేదు.

## నల్ల పోచమ్మ ఆలయంలో నవగ్రహ హోమం, అన్నదానం



**కరపత్రం ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 17,**
అమావాస్య సందర్భంగా, కోటి రాణి పార్క్ సమీపంలోని నల్ల పోచమ్మ ఆలయంలో మంగళవారం శాంతి, సమాజ శ్రేయస్సు కోసం దైవిక ఆశీస్సులు కోరుతూ పవిత్రమైన నవగ్రహ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు, ఆలయ కమిటీతో కలిసి, ఆలయంలో ఉన్న భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రభు బిరాదార్, గోవర్ధన్ లాల్, సునీల్, రవి కుమార్, ప్రవీణ్ యాదవ్, రామేశ్వర్ మిశ్రా, వీరేందర్ అవస్థి, నరేష్, ప్రముఖ సభ్యులు భక్తులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
భక్తులు, సమాజ సభ్యుల చురుకైన భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది.

కరపత్రం తెలుగు దిన పత్రిక

బుధవారం ఫిబ్రవరి 18, 2026

# నిజాయితీగల జర్నలిజం ఏమైంది...!?

» ప్రజాప్రతినిధుల చేతిలో బంధి అయ్యిందా.....!?
» ప్రజలకి అధికారుల వద్ద న్యాయంజరకపోతే
» నాటి నిలదీసే జర్నలిజం ఎక్కడ.....?




**కరపత్రం ప్రతినిధి ప్రత్యేక**
ప్రజలకి న్యాయం చేయాల్సిన అధికారులు ప్రజా ప్రతినిధులు లే అన్యాయం చేస్తూ వుంటే ఎవరిని సంప్రదించాలి...? మాకు దిక్కెవరు...? ఒకప్పుడు జర్నలిస్టుల దగ్గరికి వెళ్ళితే న్యాయం జరిగేది అనేది ఒక నమ్మకం ఉండేది కానీ ఇప్పుడు అది ప్రజాప్రతినిధుల చేతిలో... అవినీతి అక్రమార్కుల ముసుగులో కోరుక్కుపోయిందా...? నిజాయితీ గల అధికారులు లేరు...నాయకులు లేరు అంతా డబ్బు మయం....అయితే వీళ్ళని నిలదీసేన జర్నలిజం ఎక్కడ...?
ప్రజల ఆరోపణ ఒకప్పుడు నేను ఒక భారతీయ పౌరుడిని అని చెప్పుకోవడానికి గర్వం గా వుండేది...కానీ ఇప్పుడు ఎటు చూసిన...అవినీతి..రాజకీయ ముసుగులో కోట్ల అవినీతి...ప్రజా ధనాన్ని జీతాలు గా తీసుకుంటున్న అధికారులు..ప్రజలకి సరైనటవంటి సేవలందించక లంచాల మత్తులో తేలియాడుతూ..ప్రజలకి అనేకరకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారు...సిగ్గుందా అసలు మీరు తీసుకొనే జీతం మీరు కర్చు చేసే డబ్బులు అంతా ప్రజల సొమ్మే....కాదంటారా...? మనిషి నూటికి 90% కర్చుపెట్టేది...విధ్య ,వైద్యం కోసమే...కాదంటారా....? అందులోనూ అవినీతే...విధ్య, వైద్యం లోనూ కోట్ల రూపాయల ప్రజల వద్ద కొల్లగొడుతున్నారు....కాదంటారా...? ప్రజా ప్రతినిదులు నాయకులు విషయానికి వస్తె మన దౌర్భాగ్యం ఏంటంటే లచ్చా పనులు చేస్తూ,కుంభకోణాలు చేస్తూ....భినామీల పేర్ల తో కోట్లు రూపాయల ప్రజా ధనాన్ని ప్రక్క త్రోవ పట్టిస్తున్నారు....? వీళ్ళు మనకు నాయకులా..? ప్రజల పట్ల సమాజం పట్ల కనీస అవగాహన లేని ప్రజా ప్రతినిధులుకి నాయకులకి మనం ఎన్నుకొని ఓట్లు వేసి గెలిపిస్తే.... ఓట్లు సమయం లో పిచ్చి కుక్కకంటే హీనంగా కాళ్ళు వెళ్ళ పడి తీరా ఓట్లు వేసిన తరువాత....నాయకులు అధికారం లోకి వచ్చిన తరువాత ప్రజలకి సమస్య వస్తె మా నాయకుడు వున్నాడు అని ..నాయకుడి వద్ద కి వెళితే ఎవరు మీరు ఏ పంచాయితీ చూద్దాం లే తొందర పడితే పనులవ్వవు నిధులు వుండాలి కదా ఇలాంటివి ప్రజలు వినవల్సిన పరిస్థితి.... వీళ్ళ అయ్య జాగీర ప్రజల సొమ్ముతో విలాస వంతమైన బంగ్లలాలో వుంటు కోట్ల ప్రజల ధనాన్ని ప్రక్క త్రోవ పట్టించి ...ప్రజల కి కనీస అవసరాలు తీర్చలేని ...దౌర్భాగ్య స్థితిలో ప్రజా ప్రతినిధులు,నాయకులు వున్నారు అనటానికి సిగ్గు చేటు గా వుంది....ఇక మీడియా విషయానికి...వస్తె ప్రజలకి అధికారులు,ప్రజా ప్రతినిధులు వద్ద న్యాయం జరగకపోతే...నేరు గా మీడియా నీ ప్రజలు సంప్రదిస్తే...కొంత మంది జర్నలిజం ముసుగులో ఉన్న చిడపురుగులు...ప్రజల వద్ద విషయన్ని తెలుసుకొని సంబంధిత అధికారుల తో...ప్రజా ప్రతినిధులు తో ఏకమై ముడుపులకు కక్కుర్తి పడి ప్రజల సమస్యలను ప్రక్క దారి పట్టించి... అటు నాయకులకి,ఇటు అధికారులకి వత్తాసు పలుకుతున్నారు....ఇది ఇలా ఉంటే నిజాయితీ గల కొంతమంది విలేకరులు ప్రజల సమస్యలను గుర్తించి ప్రజా ప్రతినిధుల కు,నాయకులకు,అధికారులకు ప్రశ్నిస్తే తిరిగి రాజకీయ అండతో నిజాయితీగా గల విలేకరుల పై దాడి చేయటం,వారి పైన తప్పుడు ఆరోపణలు చేసి కేసులు పెట్టటం,కొంత మందిని హత మార్చుటానికి కూడా వెనుకాడటం లేదు....అసలు ఎం జరుగుతుంది...చివరికి మీడియా ద్వారా కూడా మాకు న్యాయం జరిగే సమయానికి వాళ్ళ కలానికి అడ్డుపడుతున్నారు.....ఇదెక్కడి న్యాయం ఇదెక్కడి ప్రజాస్వామ్యం..... ప్రజా సేవ ముసుగులో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన నాయకులకు,అధికారులకి ఎదిరించే యువతి యువకులు రావాలి ...అవినీతిని అంత మొందించలి..ప్రజలకి న్యాయం చేయాలి ...అలాంటి ప్రజలకి నిజాయితీ గల జర్నలిస్ట్ ల సహకారం కావాలి......
నిజాన్ని నిర్భయంగా రాయగలిగే దమ్మున్న వాళ్ళు మాత్రమే జర్నలిజం ఫ్లాట్ ఫామ్ కి రండి..అంతే కానీ నాయకులకు అధికారులకి వత్తాసు పలుకుతూ ముడుపులకు కక్కుర్తి పడి వార్తలు రాసేవాళ్ళు దేశ ద్రోహుల తో సమానం ఇప్పటికైనా నైతిక విలువలు పాటించండి.... జర్నలిజాన్ని కాపాడండి.

## మ్యాపింగ్ ప్రక్రియ పక్కడ్బందిగా నిర్వహించాలి

**– కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో/వికారాబాద్, ఫిబ్రవరి:17,**
ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.







మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏఈఆర్ఓలు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ప్రక్రియ పూర్తి చేయాలనితెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6,7,8 దరఖాస్తుల ను త్వరిత గతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్డిఓ వాసుచంద్ర, ఎన్నికల సూపరింటెండెంట్ నేమత్ అలి, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికలకూ అక్రెడిటేషన్లు ఇవ్వాలి

**– మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి 17:**
కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.
మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో గత పదేండ్లు చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగిందని,ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వంలో న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మీడియా సంస్థలకు ఈ సారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తున్నారని, ఎంపానల్ కాని ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అమిగతా పత్రికలకు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇవ్వడం లేదని, ఎంపానల్మెంట్ అనేది కేవలం ప్రభుత్వ అడ్వర్టయిజ్మెంట్లకే అని ఆయన మంత్రికి వివరించారు.
ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయాలని,అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, నాయకులు హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్ తదితరులున్నారు.

## నులిపురుగులు నివారణే ప్రధాన ధ్యేయం కలెక్టర్ కృతిక శుక్లా

**– విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న కలెక్టర్**



**కరపత్రం ప్రతినిధి**
నులిపురుగులు బాలలను శక్తి హీను లుగా మారుస్తాయి. అన్నివిధాలా ఆరో గ్యాన్ని క్షీణింపజేస్తాయి. వాటి నివారణే ప్రధాన ధ్యేయంగా జిల్లాలో వినుకొండలో డా బి ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన డీవార్మింగ్ డే కార్యక్రమమును జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ప్రారంభించారు . 1-19 ఏళ్ల వయసు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు ఎక్కువగా మట్టిలో ఆడుకో వడం, చేతులు పరిశుభ్రం చేసుకోకపోవ డంతో ఈ పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీంతో ఆరోగ్యం క్షీణిస్తుంది. 50 శాతానికి పైగా చిన్నారులు ఏదొక రకం నులిపు రుగుల బారిన పడి రక్తహీనతకు, అనారోగ్యానికి గురవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి కావున, జిల్లాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికలందరూ ఆల్బెంజోల్ మాత్రలను తీసుకొని ఈ కార్యక్రమమును జయప్రదం చేయవలసిందిగా కోరారు.మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత అల్బెండజోల్ మాత్ర తీసుకోవాలని, 1 నుంచి 5 ఏళ్లలోపు ఉన్న వారికి సగం మాత్ర గ్లాసు నీటిలో కరిగించి తాగించాలి. 6 నుంచి 19 ఏళ్లలోపు వారు ఒక్క మాత్రను మింగాలి. మధ్యాహ్నం భోజనమైన అరగంట తర్వాత ఈ మాత్రలు వేసుకోవాలని సూచించినారు.
డాక్టర్. బి .రవి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, మాట్లాడుతూ ఈ వ్యాధి వలన కలిగే అనారోగ్యాలను తెలియజేసినారు ముఖ్యంగా పిల్లలలో ఈ నులిపురుగుల వలన రక్తహీనత, నీరసం, ఆయాసం, ఎదుగుదల లోపించడం, మల మూత్ర విసర్జన ప్రదేశాల్లో దురద, చర్మంపై ఎర్రని దద్దులు, దురదరావడం, బరువు తగ్గడం, పోషకాహార లోపం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, మలంలో రక్తం పడడం, జ్వరం, తలనొప్పి ఉండడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు వీటి ద్వారా కలు గుతాయి. నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించకుండా ఉండేందుకు భోజనానికి ముందు, ఆటలు ఆడిన తర్వాత, మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి చేసుకోవాలని తెలియజేసినారు జిల్లాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికలందరూ ఆల్బెంజోల్ మాత్రలను తీసుకొని 100% లక్ష్యాలను పూర్తిగా సాధించాలని కోరినారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత తదితరులు పాల్గొన్నారు.

## మహిళా హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

**– వికారాబాద్ కోర్టులో సంచలన తీర్పు వెల్లడించిన న్యాయమూర్తి**
**– జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**




**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో/వికారాబాద్, ఫిబ్రవరి:17,**
వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారుణ హత్య, అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ వికారాబాద్ ఒకటవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెల్లడించింది. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడిస్తూ, నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. 2024లో వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పులుమామిడి గ్రామ శివారులో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం కాగా, తిమ్మాపురం మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వికారాబాద్ టౌన్ ఎస్ఐ అనిత క్రైమ్ నంబర్ 30/2024 కింద ఐపిసి సెక్షన్లు 302, 376, 379, 404, 201 కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీస్ అధికారులు భాదితురాలు చేవెళ్ళ గ్రామానికి చెందిన ఎర్రోల్ల అనుసుజగా గుర్తించినారు.సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలతో నిందితుడు వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన తలారి బాబు (అలియాస్ అవుసుపల్లి బాబు), 32 ఏళ్లు అని గుర్తించి అరెస్ట్ చేసి, పక్కా ఆధారాలతో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిహెచ్. చంద్ర కిషోర్ ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, వికారాబాద్ నిందితుడిపై నేరం రుజువు కావడంతో సెక్షన్ 302 ఐపీసీ హత్య కింద జీవితకాల కారాగార శిక్ష, రూ.5,000/- జరిమానా, సెక్షన్ 201ఆధారాల చెరిపివేత కింద 7 ఏళ్ల జైలు శిక్ష, రూ. 2,000/- జరిమానా, అలాగే సెక్షన్ 404 ఐపీసీ, సొత్తు అపహరణ కింద 3 ఏళ్ల జైలు శిక్ష, రూ. 2,000/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన దర్యాప్తు అధికారులు ఏ.అంజనేయులు, టి. శ్రీను, ఏ. నాగరాజు, బి.భీమ్ కుమార్ అప్పటి వికారాబాద్ ఇన్‌స్పెక్టర్లు, ప్రస్తుత ఎస్ హెచ్ఓ కె. రఘు కుమార్ లను జిల్లా ఎస్పీ అభినందించారు, కోర్టులో బలమైన వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెరాజ్ ఫిర్దౌస్ ని, సాక్ష్యాధారాల సమర్పణలో విశేష కృషి చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్లు ఎల్. నరేందర్ ఏఎస్ ఐ, జి. మాణిక్ ప్రభు, లైజన్ ఆఫీసర్ ఎస్. నిరంజన్ గౌడ్ లను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## అర్ధరాత్రి కేవలం 2 గంటల సమయంలో 17,19,482 ఓట్లు వేశారు...!?

2024 ఏపీ ఎన్నికల ఫలితాల పై అనుమానాలు 8 గంటల్లో నమోదు అవ్వాల్సిన ఓట్లు కేవలం 2 గంటల్లో ఎలా నమోదయ్యాయి? గత ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెనుక కుట్ర కోణం ఉందంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్న పలు రాజకీయ విశ్లేషకులు ఎన్నికల రోజు ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన పోలింగ్ శాతం అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా పెరగడం, కేంద్ర , రాష్ట్ర ఎన్నికల సంఘాల పోలింగ్ శాతానికి పొంతన లేకపోవడం పలు సందేహాలకు దారి తీస్తుందని ఆరోపణలు మే 13వ తేదీ 2024 నాడు సాయంత్రం 5 గంటల వరకు 68.04% పోలింగ్ నమోదైందని, ఇంకా పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూ లైన్లో వేచి ఉన్నారని ప్రకటించిన ఏపీ సీఈవో
అదే రోజు రాత్రి 8 గంటలకు పోలింగ్ శాతం 68.12% గా నమోదైందని, 11:45 గంటలకు 76.50% పోలింగ్ శాతం నమోదైందని ప్రకటన మే 17వ తేదీన పూర్తి పోలింగ్ శాతం 80.66% నమోదైందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 81.86% పోలింగ్ నమోదైందని అధికారిక ప్రకటన విడుదల చేసిన ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం కానీ కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం ఏపీ పోలింగ్ శాతం 81.79% ఉండడం సందేహాలకు దారి తీస్తుందని ఆరోపణలు అయితే మే 13వ తేదీన సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ శాతం 0.08% మాత్రమే పెరగడం, 8 గంటల నుండి 11:45 గంటల వరకు పోలింగ్ శాతం




ఒకేసారి 76.50% నికి పెరగడం, అంటే 5 గంటల నుండి 11:45 గంటల వరకు దాదాపు 8.38% పెరగడంపై తలెత్తుతున్న అనుమానాలు రాత్రి 11:45 గంటల తర్వాత కూడా 3,500 పోలింగ్ బూత్‌లలో ఇంకా పోలింగ్ కొనసాగుతుందని, ఆ బూత్‌లలో 4.16% ఓటింగ్ నమోదైందని, దీంతో మొత్తం పోలింగ్ శాతం 80.66% నమోదైందని ప్రకటించిన ఏపీ సీఈవో మే 14వ తేదీన ప్రెస్ మీట్ పెట్టి అర్ధరాత్రి 2 గంటలకు చివరి ఓటు నమోదైందని తెలిపిన సీఈవో సీఈవో ప్రకటించిన లెక్కల ప్రకారం పోలింగ్ రోజు రాత్రి 11:45 గంటల నుండి అర్ధరాత్రి 2 గంటల వరకు, అంటే 2 గంటల 15 నిమిషాల వ్యవధిలో, 3,500 బూత్‌లలో 17,19,482 ఓట్లు నమోదవ్వడం గమనార్హం 3,500 బూత్‌లలో 17,19,482 ఓట్లు నమోదు అవ్వాలంటే, సగటున ఒక్క బూత్‌లో 491 ఓట్లు నమోదవ్వాలి, నిమిషానికి ఒక్క ఓటు వేసినా అన్ని ఓట్లు వేయడానికి 8 గంటలు పట్టాలి కానీ 2 గంటల్లో అన్ని ఓట్లు ఎలా నమోదయ్యాయి అనేది ప్రశ్నార్థకం ఎన్నికల సంఘం లెక్కల ఆధారంగా, రాత్రి 11:45 గంటల తర్వాత ప్రతీ పోలింగ్ బూత్ ఎదుట 100 నుండి 135 ఓటర్లు వేచి ఉండాలి, అదే నిజమైతే ఒక్క బూత్‌లో 491 ఓట్లు ఎలా నమోదయ్యాయి? ఒకవేళ నిజంగానే 2 గంటల్లో ఒక్క బూత్‌లో 491 ఓట్లు నమోదైతే, ఒక్క నిమిషానికి 3.6 ఓట్లు నమోదవ్వాలి, అంటే ఓటర్ గుర్తింపు ధృవీకరణ లాంటి, వేలు ముద్ర వేయడం, వేలుకి ఇంక్ పెట్టడం, ఓటు వేయడం ఇవన్నీ కేవలం 20 సెకన్లలో పూర్తి అవ్వాలి, అది ఎలా సాధ్యం? ఈ లెక్కల గురించి ఆధారాలు ఎన్నికల సంఘం వద్ద ఉన్నాయా? ఒకవేళ వారు చెప్పిన లెక్కలు నిజమైతే అర్ధరాత్రి ఓట్లు వేసిన 17,19,482 ఓటర్లు క్యూ లైన్లో వేచి ఉన్న వీడియోలు బయటపెట్టేందుకు ఎన్నికల సంఘం సిద్ధమా అని ప్రశ్నిస్తున్న విశ్లేషకులు మే 13వ తేదీన రాత్రి 11:45 గంటలకు ఉన్న 76.50% పోలింగ్ శాతం, మే 17వ తేదీన అది ఏపీ సీఈవో పూర్తి పోలింగ్ శాతం 81.66% అని చెప్పడం, కేంద్ర ఎన్నికల సంఘం 80.66% అని ప్రకటించడంతో తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్న రాజకీయ నిపుణులు ఇదంతా చూస్తే 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా గందరగోళం నెలకొందని, భవిష్యత్తులో ఎన్నికల సంఘం ఈ అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్న విశ్లేషకులు